## మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం తీసుకురావాలి

-ప్రభుత్వానికి హేతువాద సంఘం డిమాండ్

## చంద్రబాబుకు వైకాపాపై అంత కసి ఎందుకు

- ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

## శ్రీసిటీని సందర్శించిన యూఎస్ కాన్సుల్ జనరల్

3,4 లో

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# అధినేత పర్యటనలో తమ్ముళ్ళకు భరోసా కల్పిస్తారా!

## -టిక్కెట్లు ఎవరికో అంతుపట్టని ఆంతరంగికం!!

ప్రభాతవార్త-తిరుపతి:

2024 ఎన్నికలకు రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచేలా తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు వినూత్న కార్యక్రమాలతో జనం దగ్గరకు వస్తున్నారు. ఇప్పటికే యువనేత నారాలోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రతో రాష్ట్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ,మరోవైపు జనంతో మరీ దగ్గరగా మమేకమై ప్రచారం చేస్తున్నారు. ప్రజలు కూడా లోకేశ్ పాదయాత్ర...ఆయన నైజం అవగతం చేసుకుని మద్దతుగా నిలిచేలా వ్యవహారశైలి మారింది. ఈ నేపధ్యంలో అధినేత చంద్రబాబునాయుడుసాగు,తాగునీరు ప్రాజెక్టుల పరిశీలన పేరుతో చేపట్టిన వినూత్న కార్యక్రమంలో స్థానిక నేతలు,కార్యకర్తలు నాయకుడుతో కలసి వస్తున్నారు. అయితే ఇది ఎన్నికల నాటికి టిక్కెట్ ఆశిస్తున్న వారికి, ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా చలామణి అవుతున్న వారికి ఎంతవరకు అనుకూలంగా మారుతుందనేది మాత్రం బాబు ఆంతరంగాన్ని తెలుసుకోలేకపోతున్నారు. ఇదే సమయంలో అధినేత సొంతజిల్లా ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పార్టీ టిక్కెట్లు 14 నియోజకవర్గాల్లో ఎక్కడ ఎవరికి వస్తుందో అంతు పట్టడంలేదు. ఇప్పటికే కొనసాగుతున్న ఇన్‌ఛార్జీలు ఇద్దరు ముగ్గురికి తప్ప మిగిలిన వారికి టిక్కెట్ ఇస్తారా !లేదాఅనేది సందిగ్ధంగా మారింది. కొందరు ఏకంగా కొన్ని నియోజకవర్గాల్లో రానున్న ఎన్నికల్లో అభ్యర్థి తానేనని, టిక్కెట్ ఖరారైందని విశ్వాసంతో జనంలోకి విస్తృతంగా దూసుకెళ్ళి బలంగా కార్యక్రమాలు మొదలుపెట్టారు. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే ,గత 2019 ఎన్నికల్లో స్వల్పఓట్లతో ఓటమిచవిచూసిన సుగుణమ్మ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు.ఆమె నాయకత్వంలో పార్టీశ్రేణులు పైకి కలసికట్టుగా ఉంటున్నా, లోలోపల వర్గాలుగా మారి ఎవరికి వాళ్ళే టిక్కెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారి పరిస్థితి ఏంటనేది తెలుసుకోలేకపోతున్నారు. చంద్రగిరిలో పులివర్తి నాని ఇన్‌ఛార్జిగా ఉంటూ తనదైన శైలిలో పార్టీ కోసం పోరాటం చేస్తూ, ప్రచారం ఎప్పటినుంచో మొదలుపెట్టేశారు. నియోజకవర్గంలో ప్రజలతో కలసి



ఇంటింటికి వెళ్ళి దగ్గరయ్యారు. వారికి కష్టమొచ్చినా నేనున్నానంటూ ఆదుకుంటున్నారు. ఇక్కడ రెడ్డి, కమ్మ వర్గానికి చెందిన బలమైన నాయకులు టిక్కెట్ రేసులో పోటీపడుతున్నారు. ఇక శ్రీకాళహస్తి, నగరి,సత్యవేడు నియోకవర్గాల్లో పరిస్థితి ఇలాగే ఉంది. ఇద్దరు ముగ్గురు పార్టీ నేతలు తమదంటే తమదే పార్టీ అని టిక్కెట్ కోసం పోటీనెలకొంది. జిడినెల్లూరులో ఇన్‌ఛార్జి థామస్‌కు ఒక వర్గం సహాయనిరాకరణ చేస్తున్నది. పూతలపట్టు ఇన్‌ఛార్జిగా ఇటీవల మురళీమోహన్‌ను నియమించినా పార్టీలో వర్గాలుగా మారారు. ఇక చిత్తూరులో కనీసం ఇన్‌ఛార్జి ఎవరనే దిక్కులేదు. పుంగనూరు, మదనపల్లి,తంబళ్ళపల్లిలో ఇన్‌ఛార్జిలు గట్టిగా లేరనేది పార్టీలో సీనియర్ల వాదన, ఈ నేపధ్యంలో శుక్రవారం తిరుపతి,శ్రీకాళహస్తి పర్యటనకు వస్తున్న చంద్రబాబు అభ్యర్థులను ఖరారు చేసే సూచనలు లేకపోలేదనేది పార్టీ నేతలు భావిస్తున్నారు. ఆఖరునిమిషంలో అసమ్మతి తలెత్తితే పార్టీకి నష్టం తప్పదనేది తెలుగుతమ్ముళ్ళ ఆవేదన.

### నేడు పూతలపట్టుకు ప్రతిపక్ష నేత చంద్రబాబు

ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీ సత్యసాయి జిల్లా నుండి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు అన్నమయ్య జిల్లా చిప్పిలి గ్రామంలో చిప్పిలి ఇరిగేషన్ ప్రాజెక్టును పరిశీలిస్తారు. 12.30 గంటలకు మదనపల్లి నుండి ప్రతిపక్ష నేత బయలుదేరి సాయంత్రం 3.30 గంటలకు చిత్తూరు సంతపేటలోని బార్న్స్ హోటల్‌కు చేరుకొంటారు. అక్కడి నుండి పూతలపట్టు మండలం కాణిపాకం అర్చీ నుండి ఊరేగింపుగా పూతలపట్టు అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకొంటారు. అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ప్రసంగిస్తారు. అక్కడి నుండి తిరుపతి బయలుదేరి వెళ్తారు.

## గగన్‌యాన్ ప్రయోగంలో కొన్ని అడ్డంకులు ఎదుర్కొన్నాం

### - రాజ్యసభలో చర్చకు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ సమాధానం



గగన్‌యాన్ గురించి ప్రశ్న అడుగుతున్న బీద, కేంద్రమంత్రి జితేంద్రసింగ్

శ్రీహరికోట (తడ), ఆగస్టు 3 ప్రభాతవార్త

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టులో కొన్ని ప్రధాన సమస్యలను ఎదుర్కొన్నట్లు కేంద్రమంత్రి పిఎంఒ డాక్టర్ జితేంద్రసింగ్ పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక శాఖమంత్రిగా కూడా ఆయన గత చంద్రయాన్-3 ప్రయోగ సమయంలో షార్‌కు విచ్చేశారు. గురువారం రాజ్యసభలో నెల్లూరు జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు అడిగిన నాలుగు ప్రశ్నలకు జితేంద్రసింగ్ సమాధాన మిచ్చారు. ఇందులో ప్రధానంగా కొవిడ్ మహమ్మారి, ఆ కారణంగా ముడి సరుకు సరఫరా తదితర అంతరాయాలను ఎదుర్కొన్నట్లు చెప్పారు. గగన్‌యాన్ మిషన్ విజయవంతమైన తర్వాత మరిన్ని మానవ సహిత మిషన్లు ప్లాన్ చేయబడతాయని జితేంద్రసింగ్ చెప్పారు. బీద మస్తాన్‌రావు అడిగిన ఇంకో ప్రశ్నకు సమాధానమిస్తూ ఇప్పటిదాకా గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన పురోగతిని వివరించారు. క్రూ ఎస్కేప్ సిస్టం యొక్క ధ్రువీకరణ కోసం మొదటి టెస్టు వెహికల్ మిషన్‌ను ఈ నెల లేదా వచ్చే నెలలో ప్లాన్ చేయబడినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ముందస్తుగా కొన్ని పరిశోధనలు, పరీక్షలు నిర్వహించామన్నారు. లోఎర్త్ ఆర్బిట్‌కి మానవ సహిత అంతరిక్ష విమానాన్ని పంపించడమే గగన్‌యాన్ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి మాట ఇస్తే చేస్తారంతే

### - మంత్రి రోజా



నగరి, ఆగస్టు 3 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి ట్రెండ్ సెట్టర్ అని మంత్రి రోజా అన్నారు. గురువారం నగరి పట్టణంలోని స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆమె మాట్లాడుతూ ఎన్నికలు జరిగే వరికే రాజకీయం ఆపై అందరూ మనవాళ్లే అందరికి మంచి చేయాలని జగనన్న ప్రజా సంకల్ప యాత్రలో చెప్పారని, అది అక్షరాల నేడు నెరవేరుస్తున్నారన్నారు. పార్టీలు, కుల మతాలు, సిఫార్సులు లేకుండా జరిగిందని, కనుకే నేడు జగనన్న సురక్ష ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శ్రీరామరక్షగా మారిందన్నారు. కోటి 42 లక్షల మంది ఇళ్ళను సర్వే చేసి వారి అవసరాలు గుర్తించి 93 లక్షల మందికి 11 రకాల సర్టిఫికెట్లు రూపాయి ఖర్చు లేకుండా అందించడం జరిగిందన్నారు. ఆయన విజన్ ఏంటో అందరికి పారదర్శకతతో ట్రెండ్ సెట్టర్ అయ్యారన్నారు. పాదయాత్రలో చెప్పినట్లు ప్రజల కష్టాలు దూరం చేసేలా ఇటు సంక్షేమం అటు అభివృద్ధి చేస్తూ జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికెట్లు కూడా అందించిన తీరు నభూతో నభివిష్యత్ అన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి పని చేయలేనటువంటి పని జగనన్న చేశారని, ఇది మాకు గర్వకారణమన్నారు. కమిట్‌మెంట్‌కు ఆయన ఉన్నతమైన ఉదాహరణ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రజా సేవకు ఎన్నో వ్యవస్థలు వచ్చాయని, వాటన్నింటిని సచివలయ వ్యవస్థ అధికమించిందన్నారు. సచివాలయాలు ఎందుకని అడిగిన వారికి నేడు అది ఎందుకో తెలియవచ్చిందన్నారు. నగరి నియోజకవర్గంలో 88 జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తే 44577 మంది సర్టిఫికెట్లు పొందారన్నారు. 97శాతం మందికి 11 రకాల సర్టిఫికెట్లు అందిందన్నారు. ఇది సమర్థవంతమైన పాలనకు ఆధారపూరిత నిదర్శనమన్నారు. అందుకే నేడు ప్రజల గుండెల్లో జగనన్న బొమ్మ నిలిచిపోయిందన్నారు.

## రాహుకేతుదోష నివారణ పూజల్లో మాజీ క్రికెటర్ శ్రీశాంత్



శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త

దక్షిణ కాశిగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలను గురువారం మాజీ క్రికెటర్ శ్రీశాంత్ కుటుంబసభ్యులతో కలసి జరిపించుకున్నారు. ఆయనకు కోలా ఆనంద్ ఆదేశాలతో పట్టణ బిజెపి యువ మోర్చా అధ్యక్షుడు తానికొండ భరత్‌కుమార్ నాయుడు, కటికం చందురాయల్ సారధ్యంలో స్వాగతం పలికారు.ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్న ఆయనకు స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి ఎఇఓ సతీష్ మాలిక్ స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తన ఛాంబర్‌లో స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.ఈ కార్యక్రమాల్లో బిజెపి యువమోర్చా నాయకులు నందగిరిసాయి, కుమార్,కనపర్తి శ్రీధర్ రాయల్, గాలి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### శివయ్య సేవలో మహానంది చైర్మెన్

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుని సేవకు మహానంది ధర్మకర్తల మండలి చైర్మెన్ కుటుంబసభ్యులతోపాల్గొన్నారు.వారికి ఆలయ మర్యాదలతోస్థానిక ధర్మకర్తల మండలి చైర్మెన్ ఏర్పాట్లు చేసారు.మహానంది ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొమ్మ మహేశ్వరరెడ్డి,ఆలయ ఇఓ చంద్రశేఖర్‌రెడ్డిలు వచ్చారు.స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి ఆలయ అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితులతో సత్కరించి శేష వస్త్రాలను అందించారు.వారికి ఏర్పాట్లను ఎసి మల్లికార్జున్ ప్రసాద్, వేదపండితులు శివప్రసాద్‌శర్మ, శ్రీనివాసరావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధిలో ధర్మకర్తల మండలి పాత్ర కీలకమైనది

### సీతా డైరెక్టర్ రామచంద్రారావు



ఉమ్మడి చిత్తూరుజిల్లాల అలయాల చైర్మెన్లతో సమావేశం

శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త

దేవాలయాల అభివృద్ధిలో ధర్మకర్తల మండలి పాత్ర, అధికారుల సమన్వయం ఎంతో అవసరం అని రాష్ట్ర దేవాలయ పాలన సంస్థ డైరెక్టర్ రామచంద్రరావు వివరించారు. గురువారం ఇక్కడి ఆలయంలోని సమావేశం హాలులో ఉమ్మడి చిత్తూరుజిల్లాల చిన్న ఆలయాల ధర్మకర్తల మండళ్ళ సమావేశం ఏర్పాటు చేసారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ రామచంద్రరావు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాభివృద్ధితో పాటు 31 అనుబంధ ఆలయాలను అభివృద్ధి దశలో నడుపుతున్నాయని వివరించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో అష్ట మూలల్లో నూతన శివాలయాలు నిర్మాణం, పదివేల మొక్కల పెంపకం వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలకు ధర్మకర్తల మండలి ఆలయ అభివృద్ధికి కంకణబద్ధంగా పని చేస్తున్నట్లు వివరించారు.ఈ సందదర్భంగా సీతా రాష్ట్రంలోని ఆయా ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మెన్ సభ్యులు ఆలయాల్లో విదులు బాధ్యతలు వివిధ రకాల అంశాలపై అవగాహణ శిక్షణ క్రమాలు నిర్వహించారు.ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీతా డైరెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ అభివృద్ధిలో ధర్మకర్తల మండళ్ళ పాత్ర కీలకమైనదని ఆయా ఆలయాలకు పేరు తీసుకొచ్చేలా పని చేయటం వాటిని అభివృద్ధి చేయటం దాతల సహాకారంతో భక్తులకు బస వసతులు కల్పన పనులు చేయటం పురాతన ఆలయాలకు ప్రాచుర్యం కల్పించటం వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని ఉత్సవాలు వైభవంగా నిర్వహించటం వంటి అనేక కీలక బాధ్యతలతో ఆలయ పాలన అభివృద్ధిలో ధర్మకర్తల మండలి పాత్ర అత్యుత్తమమైనదని కీలక గురుతర బాధ్యత ఉందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని చిన్న ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మెన్స్, సభ్యులు హాజరయ్యారు. ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ సతీష్‌మాలిక్, సూపరింటెండెంట్ శ్రీహరి ధర్మకర్తల మండలి సభ్యులు బుల్లెట్ శ్యాం, సాధనమునస్వామి, పసల సుమతి, దేశమ్మ టెంపుల్ చైర్మెన్ వేణుబాబు, పాలకమండలి సభ్యులు రాజేష్,విజయ్, శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం (పలమనేరు) చైర్మెన్ వీరభద్రయ్య, పాలకమండలి సభ్యులు హరీష్, శ్రీకైలాసనాథకోన చైర్మెన్ సుబ్రమణ్యం పాలకమండలి సభ్యులు వెంకటలక్ష్మీ, నందిని,డిల్లిబాబు, అలయ ప్రధానార్చకులు మహేందర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

### 29న సమాచారం వస్తే . . . సిబ్బంది నిర్లక్ష్యం . . .

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సీతా సారధ్యంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాల చిన్న ఆలయాల ధర్మకర్తల మండళ్ళకు ఒక్క రోజు సమీక్షా సమావేశం నిర్వహించుటకు ప్రభుత్వం ఆదేశించందని ఇందుకు ఏర్పాట్లు చేయాలని సీతా డైరెక్టర్ రామచంద్రరావు కార్యాలయం నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమాచారం గత నెల పంపారు.ఈ సమాచారం గత నెల 29న శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరింది. ఈ మేరకు ఆలయ ఇఓ సంతకం కూడా చేసి ఉన్నారు.అయితే ఈ సమాచారం గురువారం ఉదయం వరకు ఫైల్‌కే పరిమితమైంది. గురువారం సీతా డైరెక్టర్ ఇక్కడకు వచ్చారు. అలాగే ఉమ్మడి చిత్తూరుజిల్లాల చిన్న ఆలయాల చైర్మెన్లు, సభ్యులు చేరుకున్నారు.కానీ ఇక్కడ ఎలాంటి ఏర్పాట్లు లేవు. ఈ సమాచారం అందుకున్న చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు విచారిస్తే తపాల సెక్షన్‌కు రాలేదని తెలిసింది. దాంతో ఎక్కడ పొరబాటు జరిగిందో విచారణ జరపాలని ఎసి మల్లికార్జున్ ప్రసాద్‌కు సూచించారు.

## స్విమ్స్‌లో రోగుల సహాయకుల వసతి భవనం ప్రారంభం



ఎస్వీ బాలమందిర్ అదనపు హాస్టల్ బ్లాక్ ప్రారంభిస్తున్న టిటిడి చైర్మన్, వైవి సుబ్బారెడ్డి

తిరుపతి టౌన్, ఆగస్టు 3, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు టిటిడి తిరుపతిని మెడికల్ హబ్‌గా తయారు చేస్తోందని టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. స్విమ్స్‌లో రూ. 1.95 కోట్లతో నిర్మించిన రోగుల సహాయకుల వసతి భవనాన్ని గురువారం సాయంత్రం ఈవో ఏవి ధర్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. విసతి భవనాన్ని పరిశీలించి రోగుల సహాయకులతో మాట్లాడుతూ అనంతరం వారికి అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ టిటిడి ఆధ్వర్యంలో స్విమ్స్, బర్డ్, శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం పేదలకు విశేష వైద్య సేవలు అందిస్తున్నాయని చెప్పారు. టాటా క్యాన్సర్ ఆసుపత్రి, అరవింద కంటి ఆసుపత్రిని కూడా తిరుపతికి తీసుకురావడానికి టిటిడి తన వంతు సహకారం అందించిందన్నారు. రాబోవు రోజుల్లో స్విమ్స్‌లో శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. తిరుపతి నగరం నడిబొడ్డున పేదలకు అనేక వ్యాధులకు సంబంధించి కార్పొరేట్ ఆసుపత్రుల కంటే మిన్నగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. స్విమ్స్‌లో వందలాది మంది రోగులు వైద్య చికిత్సలు పొందుతూ ఉంటారని వార్డులోని వారి సహాయకులు వసతి కోసం చాలా ఇబ్బంది పడుతూ ఉండటాన్ని తాను స్వయంగా గుర్తించి ఓపి బ్లాక్ ఎదురుగా తాత్కాలికంగా షెడ్లు వేసి వారికి వసతి కల్పించామన్నారు. ప్రస్తుతం రూ. 2 కోట్లతో అన్ని వసతులతో పక్కా భవనం నిర్మించామని, ఇక్కడ వారికి అన్న ప్రసాదం కూడా అందించే ఏర్పాటు చేశామని వివరించారు. ఈ భవనంపైన మరో రెండు అంతస్తులు నిర్మించడానికి రూ. 4.40 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రోజుకు కనీసం నాలుగైదు వందలు పెట్టి లాడ్జిలో రూములు తీసుకోలేని పేదలకు ఈ వసతి భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్య చికిత్సలు, వైద్య సేవలు అందించేందుకు 2023 మే 25వ తేది రూ. 124 కోట్ల వ్యయంతో శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజి ఆసుపత్రిలో కీలకమైన బంకర్ బ్లాక్ భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. ఈ ఆసుపత్రిలో రూ. 200 కోట్ల వ్యయంతో అత్యాధునిక యంత్రాలు, సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదే విధంగా రూ. 97 కోట్లతో కార్డియో న్యూరో బ్లాక్ నిర్మాణానికి తమ పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. శ్రీనివాస సేతు నిర్మాణపనుల్లో పాల్గొంటూ ఇద్దరు కూలీలు చనిపోవడం బాధాకరమన్నారు. ఈ ప్రమాదం కారణంగా గడ్డర్ విరిగిపోయి నిర్మాణం ఆలస్యమైందని, ఈ నెలాఖరుకు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్వీ బాల మందర్ అదనపు హాస్టల్ బ్లాక్ భవనాన్ని చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి వారిని బాగా చదివించి ప్రయోజకులను చేయడానికి 1943లో ఎస్వీ అనాధ శరణాలయాన్ని టిటిడి ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమాల్లో జెఈవో సదాభార్గవి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వర రావు, ఎస్ఇ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, డిఈవో భాస్కర్ రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, విజివో మనోహర్, బాలమందిర్, ఎఈవో అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస సేతు నిర్మాణంలో అసంపూర్తి పనులు పూర్తి చేయండి

### కమిషనర్ హరిత



శ్రీనివాస సేతు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 3, ప్రభాతవార్త

శ్రీనివాస సేతు నిర్మాణంలో అసంపూర్తిలో ఉన్న పనులను పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి పైన జరుగుతున్న శ్రీనివాస సేతు నిర్మాణ పనులను గురువారం నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, అప్కాన్స్, ఏఈకాం ప్రతినిధులతో కలిసి కమిషనర్ పరిశీలించారు.కమిషనర్ మాట్లాడుతూ ఇక మూడు సెగ్మెంట్లను అమర్చితే శ్రీనివాస సేతు తుది దశ పనులు పూర్తి అవుతాయన్నారు. ఈ సెగ్మెంట్లను ఏర్పాటు చేసే లోపు పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు జరిగే సమయంలో అన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు. తనపల్లి కూడలి వద్ద ఉన్న కాస్టింగ్ యార్డ్‌ను కమిషనర్ పరిశీలించారు. త్వరగా మరో సెగ్మెంట్‌ను సిద్ధం చేసి, శ్రీనివాస సేతు పై అమర్చే పనులు పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు స్మార్ట్ స్ట్రీట్ పనులు, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు, సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, ఆప్కాన్ ప్రతినిధి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గుంజార్లపల్లిలో ఎమ్మెల్సీ భరత్‌చే గడపగడపకు

శాంతిపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త



మండలంలోని గుంజార్లపల్లి పంచాయతీలో గురువారం ఎమ్మెల్సీ భరత్ గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. కుప్పం ఎమ్మెల్యేగా తనకు ఓ అవకాశం కల్పించాలని కోరారు. జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, కన్వీనర్ దండపాణి, పట్టాభి,చెంగప్ప, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆడికృత్తిక కావడుల చెల్లింపులు..

కుప్పంరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త



మండలంలోని కూసూరు (పెరిపల్లం), పైపాళ్యం గ్రామం, వెంకటేష్‌పురం (పాలారు) గ్రామాల్లోని శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో గురువారం ఆడికృత్తిక కావడుల చెల్లింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. మొక్కులు కలిగిన భక్తులు వివిధ రకాల కావడులతో ఆలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పైపాళ్యం వద్ద సుమారు 60అడుగుల శ్రీ సుబ్రమణ్యస్వామి విగ్రహంకు భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.

## నేడు కాణిపాకంలో సంకటహర గణపతివ్రతం

కాణిపాకం, ఆగస్టు 3 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం సంకటహర గణపతివ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. ఈమేరకు ప్రతినెలా పౌర్ణమి అనంతరం వచ్చే చతుర్థి రోజున ఈవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు జరిగే ఈవ్రతంలో భక్తులు 350 రూపాయలు టిక్కెట్ చెల్లించి గోత్రనామాలతో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.అలాగే రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు స్వామివారికి స్వర్ణరథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు.

## 6న ఫ్యామిలీనంబర్ 1 షో

తిరుపతి,ఆగస్టు 3ప్రభాతవార్త:

తెలుగుప్రేక్షకులను అలరించేలా సరికొత్త కాన్సెప్ట్‌తో జీ తెలుగు ఛానెల్ వినోదాన్ని పంచడానికి 6వతేదీ ఆదివారం ఫ్యామిలీ నంబర్ 1 ప్రారంభమవుతుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. తారలు తమ కుటుంబాలతో కలసి సందడిచేయనున్న ఈ షో ప్రేక్షకుల కుటుంబాలను ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. 6వతేదీ ప్రారంభమై ప్రతి ఆదివారం ఉదయం 11గంటలకు జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. ఎనిమిది కుటుంబాలు సాగించే వినోధభరితమైన సరదా సమరాన్ని ప్రేక్షకులు ఆనందించలన్నారు.

## 6న కాణిపాకం ఆలయ ఉభయదారుల సమావేశం

కాణిపాకం, ఆగస్టు 3 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ఉభయదారులు సమావేశం ఈనెల 6న జరుగుతుందని ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి 21 రోజుల పాటు జరుగనున్న 2023 స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ఉభయదారుల సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. స్థానిక మణికంఠేశ్వరాలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశానికి ఆలయ ఉభయదారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## చంద్రబాబుకు లక్ష మెజార్టీ కోసం సైకిల్ యాత్ర.. మహాశక్తి ప్రచారం

### - తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ

కుప్పంరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు ఈసారి లక్ష మెజార్టీ సాధనే లక్ష్యంగా తెలుగుయువత అధ్వర్యంలో సైకిల్‌యాత్ర, మహిళా విభాగంచే మహాశక్తి పథకాల ప్రచారం శుక్రవారం నుంచి చేపట్టనున్నట్లు నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, తెలుగుయువత అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో యాభై రోజుల పాటు మహాశక్తి పథకంపై ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు అవగాహన కల్పిస్తామన్నారు. తెదేపా అధికారంలో వస్తే తల్లికివందనం పేరిట ప్రతి పిల్లవాడికి ఏటా 15వేలు, 18-50 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెలా రెండు వేలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రతి మహిళకు పసుపు,కుంకుమ, వస్త్రాలు అందించి చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తామన్నారు. రాష్ట్రంలో వైకాపా పాలనలో మహిళలపై జరుగుతున్న అరాచకాలు మహిళలకు తెలియజేస్తామన్నారు. శుక్రవారం రామకుప్పం మండలంలో సైకిల్‌యాత్రను ప్రారంభించడం జరుగుతుందన్నారు. యాభైమందితో ఈ సైకిల్ యాత్ర తొలిరోజు మొదలవుతుందన్నారు. సమావేశంలో మహిళా నేతలు సుగుణమ్మ, చంద్రకళ, శారదమ్మ, తిరుమగళ్, తెలుగుయువత రాష్ట్ర నేత మణి, సుబ్బు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా సత్యేంద్రశేఖర్ ఎన్నిక

కుప్పంరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త



కుప్పం లయన్స్‌క్లబ్ ఆఫ్ వారియర్స్ నూతన అధ్యక్షుడిగా సతే ్యంద్రశేఖర్ ఎన్నికయ్యారు. స్థానిక బిసిఎన్ హోటల్‌లో లయన్స్ క్లబ్ మూడో వార్షికోత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా జోనల్ అధ్యక్షుడు డా॥ మహేష్ మాట్లాడుతూ మూడేళ్లుగా కుప్పం ప్రాంతంలో లయన్స్ క్లబ్ చేసిన సేవలను వివరించారు. అనంతరం కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమాల్లో ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ సభ్యులు భానుమూర్తిరెడ్డి, చంద్రారెడ్డి, భక్తవత్సలరెడ్డి, అశ్వత్ నారాయణస్వామి, గంగాధర ం, నాగభూషణం, స్థానిక లయన్స్‌క్లబ్ కార్యవర్గం పాల్గొన్నారు. ఈసందర్భంగా 30వేల విలువ చేసే టైలరింగ్ మిషన్, తోపుడు బళ్లు అందించారు.

## సైకిల్‌యాత్ర విజయవంతం చేయాలి

### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త



తెదేపా అధ్వర్యంలో రామకుప్పం మండలంలో నేటినుంచి జరిగే సైకిల్‌యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. ఈనెల 8న శాంతిపురం మండలంలో సైకిల్ యాత్ర మొదలవుతుందన్నారు. ప్రతి కార్యకర్త చంద్రబాబుకు లక్ష మెజార్టీకై సైనికుల్లా పనిచేయాలన్నారు. మహాశక్తి, మిషన్ రాయలసీమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, మణి, ఎల్.జయరాంరెడ్డి, రాజేంద్ర, శంకర్, నాగరాజు, సుబ్బు, గోపాల్, ఈడిగ రమేష్, మునేగౌడు, రుద్రప్ప, అనసూయ, చం ద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ పాల్గొన్నారు. అనంతరం మండలంలోని సోమాపురంలో మృతి చెందిన బాలిక అంత్యక్రియలకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడు తరపున పదివేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, శ్రీరాములు, ప్రకాష్, మణి, జయరాంరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ముస్తాబైన షణ్ముఖ దేవాలయాలు

వెదురుకుప్పం ఆగష్టు 3 ప్రభాతవార్త:



ఈ నెల 9వ తేది బుధవారం నిర్వహిస్తున్న ఆడికృత్తిక వేడుకలకు సిద్దేశ్వర కొండలోని సుబ్రమణ్యేశ్వర దేవస్థానం, ఎట్టేరిలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి దేవస్థానాలను విద్యుత్ దీపాలకరణ చలువ పందిళ్ళు వేసి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా 8వ తేది మంగళ వారం భరణి కావడి ముడుపులు బుధవారం కావడి చెల్లింపులను గురువారం స్వామి వారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడమే కాక ప్రతి నిత్యం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి బుధవారం భక్తులకు జైన్ ఇరిగేషన్ సిస్టం వారు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి మీది నాటకాలతో పాటు పలు కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగు చర్యలు చేపట్టామని, కావున కావడి భక్తులు పై కార్యక్రమాలలో పాల్గొని స్వామి వారి కృపాకటాక్షాలను పొందాలని నిర్వాహకులు కోరారు.

## వచ్చినామా..పోయినామా...

### -సమస్యలెలా పరిష్కారమవుతాయి?

### -మండల మీట్‌లో సభ్యుల మౌనంపై ఎమ్మెల్యే బాబు అసహనం

తవణంపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాల్లో పాల్గొనే సభ్యులు ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా మౌనంగా కూరు ్చంటే సమస్యలు ఎలా వ రిష్కారమవుతాయ ని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గీత అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సమావేశానికి ఎంపీటీసీలు,సర్పంచ్‌లు హాజరై తమ పరిధిలోని గ్రామాల్లో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అయితే తవణంపల్లె మండలంలో ఆపరిస్థితి లేదని, అందుకు భిన్నంగా సమస్యలు ప్రస్తావించకుండా సమావేశానికి వచ్చినామా..పోయినామా... అనే రీతిలో సభ్యులు వున్నారని అన్నారు. ప్రజా సమస్యలు ప్రస్తావించడదానికి ఎమ్మెల్యేలకు వేదిక శాసనసభ ఎలాంటిదో ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం అలాంటిదని తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి జరిగే సమావేశాల్లో ప్రజా సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువస్తే సంభందిత అధికారులు భయంతో వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని ఎమ్మెల్యే బాబు అన్నారు.ఈసందర్భంగా మండలంలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లకు వెంటనే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ఆయా శాఖలకు సంబందించిన అభివృద్ధి గురించి అధికారులు సమావేశంలో వివరించారు. సమావేశంలో ఎంపీపీ గీత, జడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీలు శోభ, పట్నం ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, తహశీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు హేమలత, త్యాగరాజులురెడ్డి, ఏఓ ప్రవీణ్, సీడీపీఓ నిర్మల, ఉపాధి ఏపీఓ లలిత, ఏపీఎం రవి, మండల వైద్యాధికారులు డాక్టర్ దాత్రేయ చౌదరి, డాక్టర్ మోహన్‌వేలు, పశువైద్యాధికారి డాక్టర్ పల్లవితో పాటు ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, ప ంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రేపు తడ మండల సర్వసభ్య సమావేశం

తడ, ఆగస్టు 3 ప్రభాతవార్త

తడ మండల సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఎంపిడిఓ కె.అమోస్‌బాబు నేడొక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అందరు ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని, ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న సమస్యల గురించి చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

### - టీడీపీ నేతలు

బాలాయపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త:



వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని టీడీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు విమర్శించారు. మండలంలోని అలిమిలి ఎస్సీ కాలనీలో మహాశక్తి కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. ధరలు మండుతున్నాయని, ప్రభుత్వం ధరలు నియంత్రించలేక పోతుందన్నారు. వైసీపీ వైఫల్యాలపై కరపత్రాలు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్‌చరణ్‌నాయుడు, కోటేశ్వరగౌడ్, సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతరకు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది

### - జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద

వెంకటగిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త:



గ్రామశక్తి పోలేరమ్మ జాతరను సీఎం జగన్మో హన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా గుర్తించడం ఆనందించ దగ్గ విషయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. పోలేరమ్మ గుడి వద్ద ఆమె కౌన్సిలర్లతో కలిసి గురువారం పూజలు నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కు మార్‌రెడ్డి సూచన మేరకు సీఎం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించారని తెలిపారు. పోలేరమ్మ జాతరను వెయ్యి సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా జరుగుతున్నట్లు తెలిపారు. పోలేరమ్మ గుడి వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్లు కళ్యాణి, ధనియాల రాధా, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నెరవేర్చగలిగిన హామీలనే ఇస్తా

### - వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త:



నెరవేర్చగలిగిన హామీలను ఇస్తానని, చేయలేనివి చెప్పనని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 11వ వార్డు మందరిల్ల వద్ద ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు రోడ్డు కావాలని, స్మశానానికి ప్రహరీ కావాలని రామ్ కుమార్‌రెడ్డిని కోరారు. ఉన్న నిధులను బట్టి పనులు చేస్తానని చెప్పారు. చేయలేని పనులకు హామీలు ఇవ్వనని తెలిపారు. గతంలో ఉన్న వారు ఏమి పనులు చేయలేదని స్థానికులు వాపోయారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, వైసీపీపట్టణకన్వీనర్ ఢిల్లీబాబు,కౌన్సిలర్లు గోపాలకృష్ణ, కళ్యాణి, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌కుమార్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకునిగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

వెంకటగిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త:



వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. వైసీపీ జిల్లా అధ్యక్షులు నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డిని చంద్రశేఖర్‌రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తనపై ఉన్న నమ్మకంతో పరిశీలకునిగా బాధ్యత ఇచ్చారని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పెద్దల నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు.

## ఊనుగుంటపాలెం పిఎసిఎస్‌కి ఆప్కాబ్ డైమండ్ జూబ్లీ అవార్డు

కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని కోట మండలం ఊనుగుంటపాలెం పిఎసిఎస్‌కి ఉత్తమ సొసైటీ అవార్డు లభించింది. 2022-23 సంవత్సరానికి రైతులకు అందించిన సేవలను పరిగణనలోకి తీసుకొని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానం ఊనుగుంటపాలెం పిఎసిఎస్‌కు రావడం అభినందనీయం. ప్రస్తుతం ఈ సొసైటీ 14 కోట్ల టర్నోవర్ కలిగి 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.39 లక్షల లాభాన్ని ఆర్జించింది. ఈ సంఘ అభివృద్ధి సొసైటీ పరిధిలోని రైతులందరూ రుణాలు సకాలంలో చెల్లించడంతో ఉత్తమ పురస్కారానికి ఎంపికైంది. నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వారి ప్రోత్సాహంతో ఈ సంఘం అనేక రుణాలైన హౌసింగ్, వాహన రుణాలు, గోల్డ్ లోన్లు, క్రాప్ లోన్లు తదితరవి అందించి రైతులకు మరింత చేరువైంది. సొసైటీ పరిధిలోని రైతుల ప్రోత్సాహంలో అన్ని రకాల రుణాలు అందిస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ హనుమంతరెడ్డి, సిఇఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. తమకు ఈ సొసైటీ అభివృద్ధికి రైతుల సహకారం మరువలేమని సిఇఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

## కోటలో ఎంఎల్‌సి బల్లి కల్యాణ చక్రవర్తి సుడిగాలి పర్యటన

కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త



కోట పట్టణంలో గురువారం ఎంఎల్‌సి బల్లి కల్యాణ చక్రవర్తి సుడిగాలి పర్యటన జరిపారు. రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రటరి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆయన వెంట నడిచారు. వారితో పాటు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలోని సచివాలయ భవనాలను వారు పరిశీలించారు. పాత ఆసుపత్రి నుంచి దాదరాయగుంట వరకు సిసి రోడ్ల ప్రతిపాదనలను, గాంధీబొమ్మ సెంటరు నుంచి నిర్మాణం పూర్తయిన సిసి రోడ్లను పరిశీలించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని అక్కడ ఉన్న పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రెవెన్యూ ప్రాంగణంలోకి మార్చాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. పాత పంచాయతీ భవనాన్ని తొలగించాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. పోలీసు క్వార్టర్స్ ప్రాంతాన్ని ఎంఎల్‌సి కల్యాణ చక్రవర్తి పరిశీలించారు. త్వరలోనే సచివాలయ భవనాలను ప్రారంభించాలని అధికారులను ఎంఎల్‌సి ఆదేశించారు. కోటలో ఇంకా జరగాల్సిన అభివృద్ధిపై నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆర్డీఓతో, ఎంఎల్‌సి బల్లి కల్యాణ చక్రవర్తితో చర్చించారు. వారి వెంట తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ మారెళ్ల భవాని, ఇఓపిఆర్‌డి కిరణ్‌కుమార్, వైసీపీ యువ నాయకుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యాలయానికి స్థలం ఇవ్వండి

కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త



కోట మండలంలో 30 సంవత్సరాలుగా బిజెపి ప్రజల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ అధికారుల ద్వారా పరిష్కరించామని జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఎస్.అంబరిష్, మండల బిజెపి అధ్యక్షులు సారంగం రమేష్ చెప్పారు. గురువారం కోటలో ఎంఎల్‌సి బల్లి కల్యాణ చక్రవర్తితో పాటు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పర్యటించారు. ప్రభుత్వ స్థలం పార్టీ భవన నిర్మాణం కోసం మంజూరు చేయాలని అధికారులను కోరారు. అదేవిధంగా పాత ప్రభుత్వాసుపత్రి ఖాళీ స్థలాన్ని గతంలో పెల్లేటి వీరరాఘవరెడ్డి దానం చేశారని, ఆ స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలే తప్ప ఇతర ప్రైవేటు సంస్థలు నెలకొల్పరాదని సూచించారు. ఆ ప్రాంతానికి శ్రీపెల్లేటి రాఘవరెడ్డి నామకరణం చేయాలని వారు కోరారు.

## ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

### - ఎంపిడిఓ మారెళ్ల భవాని

కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం కిట్లను ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నామని ఎంపిడిఓ మారెళ్ల భవాని చెప్పారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ ప్రాంగణంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఇంటికే సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. నెలలో రెండు విడతల్లో సరుకులను అందజేస్తున్నట్లు చెప్పారు. మొదటి విడతలో మూడు కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, అర కిలో నూనె, 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు, రెండో విడతలో రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, అర కిలో బెల్లం, వేరుశనగ చిక్కీలు, ఎండు ఖర్జూరం, 2.5 లీటర్ల పాలు, 12 కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ మునికుమారి, సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, సర్పంచ్ వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

### డ్రైవర్ మృతి

చిల్లకూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త



మండలంలోని తిప్పగుంటపాల్యెం గ్రామం సమీపంలో గురువారం రొయ్యల చెరువులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నల్లయ్యగారి పాల్యెం గ్రామానికి చెందిన కొండేటి వెంకటసుబ్బయ్య (44) అనే డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైయస్‌ఆర్ కిట్‌ల పంపిణి

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమనాడు గ్రామంలో గురువారం సర్పంచ్ బ్రరెహేమభూషణరెడ్డి అధ్యక్షతన తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు.తాము అధికారంచేపట్టిన తరువాత గ్రామంలో తల్లి బిడ్డలకు అందించే పథకాలను అందించటంలో చొరవ చూపామన్నారు. ఈ కార్యక్రమాల్లో హేమభూషణరెడ్డి తోపాటు అంగన్‌వాడి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం తీసుకురావాలి

**-ప్రభుత్వానికి హేతువాద సంఘం డిమాండ్**

తిరుపతి ప్రెస్‌క్లబ్, ఆగస్టు 3 ప్రభాతవార్త:




రాష్ట్రంలోని ప్రజలు చదువుకున్న విద్యావంతులు, చదువు లేనివారు మూఢ నమ్మకాలతో తమ బ్రతుకులను కాలరాల్చుకుంటున్నారని, తక్షణం ప్రభుత్వం స్పందించి మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం తీసుకురావాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ భిన్న మతాలు, సంస్కృతులు, ఆచారాలు కలిగిన మన దేశానికి లౌకికవాదమే సరైన పరిష్కారమన్నారు. ప్రజా ప్రతినిధులు, ఐఏఎస్, ఐపిఎస్‌లు లౌకికవాదం ప్రకారం పరిపాలన చేయాలి. అలా కాకుండా తాజాగా నూతన పార్లమెంట్ ప్రారంభ సమయంలో పార్లమెంట్ భవనంలోకి బేతాల మాంత్రికులను పిలిపించి, వారిని సన్మానించి సాక్షాత్తూ ప్రధాని వారికి సాష్టాంగ పడటం సిగ్గుచైన విషయమన్నారు. ఇంకోవైపు ఇస్రో చైర్మన్ లాంటి వ్యక్తి రాకెట్ ప్రయోగానికి ముందు చెంగాలమ్మ గ్రామ దేవతకు మొక్కడం, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లు మృత్యుంజయ యాగాలు చేయడం, యూనివర్సిటీలో భూత వైద్యాన్ని ప్రవేశపెట్టడం, ముఖ్యమంత్రి యజ్ఞ యాగాదులు చేయడం, ప్రధానులు, గవర్నర్లు దొంగ బాబాల ఆశ్రమాల చుట్టూ తిరగడం లాంటివి రాజ్యాం విరుద్ధమన్నారు. ఏ దేశంలో అయితే మూఢ నమ్మకాలు తగ్గుతాయో ఆ దేశం త్వరగా అభివృద్ధి చెందుతుందన్నారు. శాస్త్ర విజ్ఞానం ద్వారా తయారైన టివిలు సైతం రంగు రాళ్ల మీ జీవితాలు మారుస్తాయని, పేరులోని అక్షరాలు మార్చుకుంటే మీ జీవితాలు మారుతాయని, రుద్రాక్షలు ధరిస్తే మీకు మంచి యోగం ఉంటుందని రకరకాల మూఢ నమ్మకాలు ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలలో మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం ఉందని, అక్కడ వాటిని ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కాబట్టి మన రాష్ట్రంలో కూడా ఆ చట్టాన్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హేతువాద సంఘంసభ్యులు మోహన్‌రెడ్డి, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయుపై జరుగుతున్న పైశాచిక దాడే

**-డాక్టర్ ఉమేష్‌రావు**

శ్రీకాళహస్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త



విద్యారంగంలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంపై మూడు రహదారుల నిర్మాణం పేరుతో వైసిపి చేస్తున్నది ముమ్మాటికి పైశాచిక దాడేనని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం. ఉమేష్‌రావు ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 70సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఎస్వీయులో ఎంతోమంది ఉన్నతికి ఉపయోగపడిన ప్రయోగ ప్రాంగణాన్ని మాస్టర్‌ప్లాన్ సాకుతో చిన్నాభిన్నం చేయాలనుకుంటున్న అధికార వైకాపా నాయకులు మానసిక ఆరోగ్య స్థితిని పరీక్షించాలని ఉమేష్ ప్రభుత్వానికి సూచించారు. ఉన్నత ప్రమాణాల పరంగా ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఎస్వీయు అస్తిత్వాన్ని పూర్తిగా నాశనం చేసేలా పరిశోధనలకు ఉపయోగపడేందుకు ఎంతో శ్రమతో కూడిబెట్టిన విశ్వవిద్యాలయ పరిధిలో గల ఎన్నో విలువైన వృక్షజాతులను అంతమొందిచడానికి తిరుపతి పురపాలక కార్పొరేషన్ నడుం బిగించడం అత్యంత బాధ్యతారాహిత్యం అని ఉమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో వెలసిన వెంకటేశ్వరస్వామి పాదాల చెంత విద్యారంగంలో అభివృద్ధి చెందాలన్న విద్యాభివృద్ధికి మాత్రమే అని అలా కాకుండా రోడ్లు, బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు నిర్మిస్తామనడం లీజు నిబంధనలను అతిక్రమించడమే అని ఉమేష్ ఆరోపించారు. కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ వన్నెకుల క్షత్రియ సాధికార కమిటీ సభ్యులు మిన్నల్‌రవి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), మైనార్టీ విభాగం తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి షేక్‌జిలానీ, పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డివి. నారాయణ, మాజీ డైరెక్టర్ షేక్‌ఖాదర్‌బాషా, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాపాలనుంచి మనల్ని కాపాడుకోవటమే స్వర్గ ప్రాప్తి

శ్రీకాళహస్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త

నేడు మనం పాపాల పుట్టలో మునిగిపోతూ స్వర్గప్రాప్తి కోసం అల్లాహ్‌ను ప్రార్థిసే వరాలిస్తారా? అని హైదరాబాదుకు చెందిన మత గురువు హజ్రత్ మౌలానా ముజాహిద్ సాహెబ్ అన్నారు. మూడు రోజుల పాటు ఆయన శ్రీకాళహస్తిలోని పలు మసీదుల్లో తన అనర్గళ ప్రసంగాన్ని అందించారు. మహిళల మద్రస, ఖుబా మస్జిద్‌లలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన చైతన్యవంతుల్ని చేసే కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఆయన దివ్యఖుర్ ఆన్, హదీసుల గురించి వివరిస్తూ నేడు మనం అల్లాహ్ ఆదేశాలను తుంగలో తొక్కి పరమత మోజులో పడి ఆచార వ్యవహారాలకు తిలోదకాలిస్తూ కాలం గడుపుతున్నాయని ఈ వాతావరణం నుంచి మనల్ని మనం కాపాడుకుంటూ బావితరాలకు మార్గదర్శకం కావాలన్నారు. మొదట మనం పాపాలనుంచి విముక్తులు కావాలన్నారు. దేవుని వద్ద క్షమాబిక్ష కోరాలన్నారు. నేడు సమాజంలో పరిస్థితులు బాగా లేదని రాబోవు రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగితే మసీదులుండవు, మద్రసాలు కనబడవు. కాబట్టి మన జీవిత రహస్యం గురించి తెలుసుకొని మసలాలన్నారు. కనీసం మన మతం గురించి అవగాహన కల్గి ఉండుటకు గురువుల ఉపదేశాలను వినాలని విన్న మంచిని ఆచరించాలని ముజాహిద్దీన్ సాహెబ్ పిలుపు నిచ్చారు. ఆయన సమావేశాలకు విశేషంగా భక్తులు హాజరయ్యారు.

## బిజెపి సమావేశంలో రాష్ట్ర మీడియా ప్రతినిధి

శ్రీకాళహస్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త



భారతీయజనతాపార్టీ నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కోర్ కమిటీ, అసెంబ్లీ కన్వీనర్ మరియు పదాధికారులు మండల అధ్యక్షులు సమావేశంలో పట్టణ బిజెపి సమన్వయకర్త, రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా. ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాలతో నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 10వ తేదీన 5వేల మందికిపైగా మహాధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నెల్లూరు జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిఎంవి కండ్రిగలో తల్లిపాల వారోత్సవాలు

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి మండలం టిఎంవి కండ్రిగలో గురువారం అంగన్‌వాడి సారధ్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రజా ప్రగతి ట్రస్టు గ్రామ సచివాలయం, వైద్య ఆరోగ్యసిబ్బంది, సంయుక్తంగా తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ఎత్తున అవగాహన చైతన్య ర్యాలిని నిర్వహించారు. ప్రజాప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్ చంద్రశేఖర్ సారధ్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లిపాలు ప్రాముఖ్యతను తెలిపే గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో కార్యదర్శి హేమశ్రీ, దవ్య తదితరులు పాల్గొన్నారు.

## జడ్పి చైర్మన్ ఆనం అరుణమ్మను కలిసిన వైసిపి నాయకులు

ఓజిలి, ఆగస్టు 3, ప్రభాతవార్త



జడ్పి చైర్మన్ ఆనం అరుణమ్మను గురువారం నెల్లూరు జిల్లాలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో విదేశీ పర్యటనకు వెళ్లి వచ్చిన ఆనం అరుణమ్మను గురువారం ఓజిలి జడ్పిటిసి సభ్యులు గుంట మడుగు రవీంద్రరాజా, వైకాపా నాయకులు దేశి రెడ్డి మధుసూధన్ రెడ్డి, జేసిఎస్ మండల కన్వీనర్ షేక్ ఖాధర్ భాషా, అజుముతుల్లాలతో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్చం అందజేసారు. ఆమె వారితో అభివృద్ధి కార్యక్రమాలకు చర్చించారు. 2024 గెలుపుకు కష్టపడి పని చేయాలని పిలుపునాచ్చరు.

## మహిళా లోకం మేలుకో నీ ఇంటిని నువ్వే చక్కదిద్దుకో

"కళకళ లాడిన తెలుగు మహిళల కార్యక్రమం...

పుత్తూరురూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపు భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు రూరల్ మండలం తొరూరు పంచాయతీలో ఆనంబట్టు, వేపగుంట పంచాయతీ మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. గురువారం పుత్తూరు రూరల్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీల సహకారంతో చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మిప్రసన్న, నగరి ప్రధాన కార్యదర్శి నాగరత్న ఆధ్వర్యంలో మేనిఫెస్టోలో పొందుపరచిన మహాశక్తి గురించి పంచాయతీలో ఇంటింటికి వెళ్లి తెలుగు మహిళలు వివరించారు. వారు మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో మీ ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుతున్నా వారందరికి ఒక్కొక్కరికి 15 వేలు, ఆడ బిడ్డ నీది కింద 18 సంవత్సరాలు నిండిన 1500 రూపాయలు, దీపం పేరుతో ఇంటికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటింటికి తాగునీటి కొళాయి, తదితర అంశాలను మహిళ్యా శక్తితో ముందుకు తీసుకుపోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బాలాజీ, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మిప్రసన్న, నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి నాగరత్న, మండల అధ్యక్షురాలు కవిత, గుణ భూషణమ్మ, రాష్ట్ర పార్లమెంట్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జి, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక శాసనసభ్యులు బియ్యపుమధుసూధన్‌రెడ్డికి సిపిఐ పార్టీ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ కార్యదర్శి జనమాలగురవయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం రామాపురం పంచాయతీ భగత్‌సింగ్ కాలనీలో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని నియోజకవర్గంలో దళితులకు స్మశానాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్‌లో అర్హులైన వారికి బ్యాంకులో సబ్సిడీలో రుణాలు ఇప్పించాలని ఎంఎల్‌ఏకు విన్నవించారు. ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఏతో పాటు తొట్టంబేడు మండల పార్టీ సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, సిపిఐ రూరల్ మండల కార్యదర్శి శివకుమార్, పట్టన ప్రధాన కార్యదర్శి గోపి, శాఖ కార్యదర్శి రాజయ్య, వినాయక తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిషనర్‌కు దర్గా కమిటీ సభ్యుల సత్కారం

శ్రీకాళహస్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పురపాలక సంఘ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబును పానగల్ దర్గా కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలసి ఆయన్ను దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కమిషనర్‌గా పనిచేశానని, తిరిగి మళ్ళీ శివయ్య పుణ్యక్షేత్రంలో పనిచేయడం తన అదృష్టమని కమిషనర్ వివరించారు. గతంలో కమిషనర్‌గా ఉన్నపుడు ఎప్పటికప్పుడు పారిశుద్యానికి మంచి ప్రాధాన్యత ఇస్తూ పట్టణ పరిశుభ్రతకు నిరంతరం సేవలందిస్తు తిరిగి శ్రీకాళహస్తికి రావడం ఎంతో అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతులు సయ్యద్ అహ్మద్, బాబా ఫరీద్, కమిటీ సభ్యులు, అధ్యక్షులు నాగేశ్వరరావు, ఎంఎస్‌జమ్రుద్‌బాషా, రాజేశ్వరరావు, గరికపాటిరమేష్‌బాబు, ప్రవీణ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఉదయం నుంచి కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

## వైఎస్ఆర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 3, ప్రభాతవార్త

వైఎస్ఆర్ లైఫ్ టైం అవార్డు 2023 వైఎస్ఆర్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అధికారి డాక్టర్ వి. మురళీకృష్ణా రెడ్డి తెలిపారు. కళలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీసెస్, స్పోర్ట్స్ తదితర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభా పాటవాలు చూపిన వ్యక్తులు దరఖాస్తుకు అర్హులని వివరించారు. ఉత్తమ సేవలు అందిస్తున్నప్పటికీ ప్రజా జీవనంలో కనిపించక అజ్ఞాత వ్యక్తుల్లా గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు కూడా అర్హులని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సంస్థలు, సొసైటీలు కూడా దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. వ్యక్తులు, సంస్థలు చేసిన పనిని ఒక పేజీలో క్లుప్తంగా తెలియజేస్తూ ఈ మెయిల్‌తో సహా పూర్తి వివరాలను సమర్పించాలని సూచించారు. క్రీడా రంగంలో గల ఆసక్తి, అర్హత గల వ్యక్తులు, సంస్థలు దరఖాస్తులను ఆగష్టు 20వ తేది సాయంత్రం 5 గంటలు లోగా సమర్పించాలని కోరారు

# గ్రీన్‌ప్యానల్ ద్వారా సబ్సిడీ మొక్కలు పంపిణీ

తొట్టంబేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త



ఉచిత, సబ్సిడీ పద్ధతిలో జామాయిల్, తైలం మొక్కలు పంపిణీచేస్తున్నట్లు గ్రీన్‌ప్యానెల్ కంపెనీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని రౌతుసూరమాల గ్రామంలో ఉన్న గ్రీన్‌ప్యానెల్ యాజమాన్యం యొక్క టెక్నికల్ పరిజ్ఞానంతో బీడు, బంజరు, ఇసుక మరియు ఎర్రనేలలు సునాయాసంగా పెరిగే క్లోనింగ్ పద్ధతి ద్వారా ఉత్పత్తి చేసిన కాండం నిటారుగా పక్క కొమ్మ లేకుండా అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ కలప దిగుబడినిచ్చే నీలగిరి మొక్కలను కంపెనీ నుంచి 30 కిలోమీటర్లు పరిధి దాటిన రైతులందరికీ 'సబ్సిడీ' పద్ధతిలో మరియు 30 కిలోమీటర్లు పరిధిలో ఉన్న రైతులందరికి ఉచితంగా అందిస్తుందన్నారు. కంపెనీ నుంచి 100కి.మీ పరిధిలో ఉన్న గ్రీన్‌ప్యానెల్ మేనేజ్‌మెంట్ మద్దతుతో ఖాళీగా ఉన్న వృధా భూములను సాగులోకి తీసుకురావడం ద్వారా కుటుంబ వలసలను తగ్గించడంలో ఫారమ్ ఫారెస్ట్రీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ద్వారా చిన్న మరియు సన్నకారు రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి సహాయపడుతుందన్నారు. మరిన్ని మెరుగైన సేవలను రైతులకు అందించేందుకు కంపెనీ ఓ ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి అర్హత సాధించిన సిబ్బందిని నియమించి వారి ద్వారా రైతులందరికీ సకాలంలో క్లోనింగ్ పద్ధతి ద్వారా ఉత్పత్తి చేసిన జామాయిల్/తైలం మొక్కలను అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి పునాదులు వేస్తుందన్నారు. అంతేకాకుండా కంపెనీ తరపున సామాజిక కార్యక్రమాలు చేస్తుందన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అమలు చేయబడుతున్నాయన్నారు. ఈఏడాది 2కోట్ల మొక్కలు పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కావున రైతులందరు మెరుగైన సేవలు పొందుటకు 9100888676, 8700493301 నంబర్లకు పోన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

# తిరుపతి డివిజన్

## అమ్మ పాలు అమృతం .. ముర్రుపాలు ఔషధం

**డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జె. రామాంజనేయులు**

చంద్రగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త:



అమ్మపాలు బిడ్డకు అమృతమని ఎస్వీఎంసి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జె. రామాంజనేయులు అన్నారు. స్థానిక గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రంలో గురువారం ఎస్వీ మెడికల్ కళాశాల సామాజిక వైద్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమని అన్నారు. ముర్రుపాలు విశేష ఔషధ గుణాలు కలిగినవన్నారు. ప్రతి ఏటా ఆగస్టు మొదటి వారంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో తల్లి పాల ఆవశ్యకతపై తల్లులకు, గర్భవతులకు వివరించారు. శిశువు జన్మించిన గంటలోపు పాలు (ముర్రుపాలు) పట్టాలన్నారు. 6 మాసాల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అన్నారు. ప్రస్తుతం శిశువుకు ముర్రుపాలు పట్టిస్తున్న తల్లుల సంఖ్య ఎన్ఈహెచ్ఎస్-5 సర్వే ప్రకారం 52 శాతం మాత్రమే వుందన్నారు. ఇది వందశాతం సాధించడానికి అవగాహన కల్పించడం ఒక్కటే మార్గమని అన్నారు. బిడ్డ ఎదుగుదలకు, చక్కటి ఆరోగ్యానికి, వ్యాధుల నుండి రక్షణకు దోహదపడగలవన్నారు. రొమ్ము క్యాన్సర్‌తో పాటు సహజ కుటుంబ నియంత్రణకు తల్లి బిడ్డకు పాలు ఇవడ్వం ద్వారా రక్షణ లభించగలదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకళ, హెల్త్ ఆఫీసర్స్ డాక్టర్ శశికళ, డాక్టర్ యుగంధర్, వైద్య బృందం డాక్టర్ కాజల్ ఆనంద్, డాక్టర్ సౌమ్యప్రియ, డాక్టర్ రేవతి, సోషియాలజీ అధ్యాపకులు అహల్యాబాయి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల, హెల్త్ ఎద్యుకేటర్ తాతాబాయి, హెల్త్ అసిస్టెంట్స్, వైద్య పిలులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది, ప్రసూతి మహిళలు, బాలింతలు పాల్గొన్నారు.

## 7న మణిపూర్ ఆక్రందపై నిరసన

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 3, ప్రభాతవార్త

మణిపూర్ రాష్ట్రంలో కుక్కిలను వందలమంది హత్య, ఇద్దరు స్త్రీలను వివస్త్రనుచేసి రోడ్డుపై నడిపించిన దుర్మార్గ చర్యను యావత్ ప్రపంచం గర్వింహించింది, తీవ్రంగా ఖండిస్తుందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి. అంజయ్య తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటి వరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించడం కానీ బాధితులకు కనీస భరోసా ఇవ్వడం ఇవ్వకపోవడం నోరు విప్పి మాట్లాడకపోవడం యావత్ ప్రజానీకం ఆలోచించదగ్గ విషయమన్నారు. మణిపూర్‌లో కుకిలపై జరుగుతున్న ధమనకాండపై సమగ్ర విచారణ జరిపి మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని తెలిపారు. ఈ నెల 7వ తేది సోమవారం ఉదయం 10.30 గంటలకు తిరుపతి ఆర్‌డిఓ ఆఫీస్ వద్ద ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిరసన సంఘీభావం తెలియజేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రజా స్వామ్యవాదులు సామాజిక ఉద్యమకారులు అధికంగా పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేయగలరని కోరుతున్నారు.

## ప్రజా నాయకుడు మధుసూదన్‌రెడ్డి - సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి

రేణిగుంట, ఆగస్టు 3 ప్రభాతవార్త:




ఆంధ్రప్రదేశ్ జన హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అయితే, ప్రజా నాయకుడు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి అన్నారు. విప్పమానుపట్టెడ పంచాయతీ వేమాపురం సంజీవరెడ్డి కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణలో భాగంగా బాలింతలు, గర్భిణీ స్త్రీలకు లక్ష్మిపతిరెడ్డి పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. చాలా మంది పోషకాహార లోపాలకు గురై ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కోకిల, ఏఎన్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పురిటి బిడ్డలకు తల్లిపాలు అమృతాహారం

**- ఎంపీటీసీ ఆనందరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసులు**



రేణిగుంట, ఆగస్టు 3 ప్రభాతవార్త:

పురిటి బిడ్డలకు తల్లిపాలు అమృత ఆహారం అని మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి మంచి పౌష్టికాహారం తీసుకుని తల్లి, బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని తూకివాకం ఎంపీటీసీ ఆనందరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని ఎర్రమరెడ్డిపాళెంగ్రామంలో వైఎస్ఆర్‌సంపూర్ణ పోషక టేక్ హోం పంపిణీ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను నిర్వహించారు. ఐసీడీఎస్ రేణిగుంట ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తూకివాకం ఎంపీటీసీ ఆనందరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగాపాల్గొని గర్భిణీలకు, తల్లులకు టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త మునిలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## చిన్నారులు వ్యాయామం చేసుకోవడంలో పిల్లల్లో మంచి ఫలితాలు

పుత్తూరురూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:



ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు భవిత కేంద్రంలోప్రతి గురువారం ఫిజియోథెరఫి క్యాంపు నిర్వహించబడుతుందని ఫిజియోథెరపిస్ట్ జె. హేమలత తెలిపారు. గురువారం భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు వ్యాయామం చేసుకోవడం ద్వారా పిల్లల్లో మంచి ఫలితాలను సాధించేందుకు వీలుంటుందని తెలిపారు. పిల్లలు తన పనులను సులభంగా చేసుకోవడానికి ఉపయోగపడుతాయన్నారు. భవిత కేంద్రంలో నేర్పిస్తున్నచిన్నపాటి వ్యాయామాలను ప్రతి రోజు ఇంటి వద్ద చేయించాలని తెలిపారు. వారం వారం భవిత కేంద్రంలో జరుగుతున్న ఫిజియోథెరపికి హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు పి. ఆనంద్, సూర్యకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

-ఆరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారు -నేడు రాష్ట్రంలో దళారి వ్యవస్థ నడుస్తోంది -కురుగొండలో మహాశక్తి కార్యక్రమం ప్రారంభం -టిడిపి చైతన్య యాత్రలో ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే నెలవల


మహాశక్తి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం

ఓజిలి, ఆగస్టు 3 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తు అని మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ జన చైతన్య యాత్ర గురువారం ఓజిలి మండలంలోని కురుగొండ గ్రామంలో దిగ్విజయంగా సాగింది. ప్రతి ఇంటికి వెళ్లి తెలుగు దేశం పార్టీ అధికారంలో వస్తే పనికి సంక్షేమ పథకాలు అందుతాయని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుందని ఆయన అన్నారు. ఓజిలి మండలంలోని కురుగొండ గ్రామంలో తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో దళారీ వ్యవస్థ నడుస్తోందని, సామాన్యులు బతికే పరిస్థితి ఈ ప్రభుత్వం కల్పించలేక పోయిందని విమర్శించారు. నిత్యావసర సరుకుల నుంచి ప్రతి వస్తువుకు ముక్కుపిండి అధిక ధరలను ఈ ప్రభుత్వం వసూలు చేస్తోందని ఆయన విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మహిళల గురించి ప్రత్యేకంగా ఆలోచించి ఈ మహాశక్తి రథం కార్యక్రమం ద్వారా మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేసారన్నారు. దీపం పథకం పేరుతోఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. 18 ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ. 1500, తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలు చదువు తుంటే అంతమందికి ఏడాదికి రూ. 15 వేలు ఇచ్చే విధంగా రూపకల్పన చేశారని తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్ర బాబును గెలిపించుకుంటే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. టిడిపికి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని వైసిపి ఆరాచక పాలనతోప్రజలు విసిగిపోయా రన్నారు. 2024లో టిడిపి జెండా ఎగరడం ఖాయమని జోష్యం చెప్పారు. భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ అధినేత చంద్రబాబు ఆరు సంక్షేమ పథకాలను టిడిపి మేనిఫెస్టోలో ప్రవేశ పెట్టారని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.

సైకో పోవాలంటే సైకిల్ రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, మహిళా అధ్యక్షురాలు చివాడ పవిత్ర రెడ్డి, ఉపాధ్యక్షురాలు గుంట మడుగు ప్రసన్న, దాసరి నిరంజన్ కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు, పాడి వెంకట సుబ్బయ్య, అనుబోలు రవీంద్రారెడ్డి, చింతల సరోజినమ్మ, సుబ్రమణ్యం రాజు, కార్తీక్‌రాజు, జయ చంద్రారెడ్డి, కిషోర్ కుమార్ రాజు, నారాయణ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నరేష్ రాజు, పురుషోత్తం రాజు, గెడి శ్రీనివాసులు రెడ్డి, కట్టంరెడ్డి శ్రీనివాస రెడ్డి, కన్న సుబ్రమణ్యం, వెంకటేష్, తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువతలో మార్పు కోసమే తమ 'మన్యం రాజు' చిత్రం

-చిత్ర నిర్మాత,దర్శకుడు సోమసుందరం



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 3 ప్రభాతవార్త: గంజాయి మత్తుకు బానిసలై తమ జీవితాల్ని ఛిద్రం చేసుకుం టున్న యువతలో మార్పు కోసమే తాము 'మన్యం రాజు' చిత్రాన్ని తెరకెక్కించామని ఆ చిత్ర దర్శకుడు సోమసుందరం వెల్లడించారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో చిత్ర యూనిట్ సభ్యులు ప్రధాన విలన్ పాత్రధారి భీమాస్ అశోక్,నటులు బెల్లంకొండ సురేష్,జీవన్,కొరియోగ్రాఫర్ పవన్,సహ నిర్మాత మురళి ప్రసాద్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా సమాజాన్ని ఉద్ధరించాల్సిన భావి భారత పౌరులైన యువత మత్తు పదార్థాలకు బానిసలయ్యి ఎన్నో అసాంఘిక కార్యక్రమాలు,హత్యలు చేస్తూ సమాజానికి హాని కలిగిస్తూ,మరో వైపు వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తమ చిత్రంలో ప్రభుత్వానికి అర్థం అయ్యే రీతిలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించి యువతలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నం చేశామన్నారు. ఈ చిత్రం చూసైనా ప్రభుత్వం గంజాయిని అరికట్టడానికి తగు చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. నేడు 4వ తేదీ శుక్రవారం తిరుపతి పిజిఆర్ థియేటర్‌లో విడుదల కానున్న 'మన్యం రాజు' చిత్రాన్ని ప్రేక్షకులు తిలకించి తమను ఆశీర్వదించాలని కోరారు. పెద్ద సినిమాకు తగ్గకుండా 75 లక్షల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో పెడదారి పడుతున్న యువతకు మంచి సందేశంతో పాటు,ప్రేక్షకులకు కావాల్సిన అన్ని నవరసాలు ఉన్నాయి కాబట్టి,ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## సుధీరన్న మీ అవినితి భాగోతం చిట్టా విప్పుతా!

-ఫ్లేక్సీల సమాదానం ఊరందూరు దళితవాడతోనే : మధుసూధనరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త : సుధీరన్న మీ అవినీతి భాగోతం చిట్టా విప్పుతామని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ఫ్లేక్సీల సమాధానం ఊరందూరు దళిత వాడ నుంచే ప్రారంభిస్తామని ఎంఎల్‌ఏ వివరించారు.కరోనా కాలంలో తమ గ్రామానికి కూడా రూపాయి సహాయం చేయని మీరు నా గురించి నా సేవ గురించి విమర్శించటం హాస్యాస్పదమన్నారు.తెలుగుదేశం హయాంలోనే అభివృద్ధి జరిగి ఉంటే నేడు మా ప్రభుత్వం 25వేల ఇళ్ళు ఎందుకు అందించాల్సి వస్తోందని ప్రశ్నించారు.తనకు ఆంగ్లం రాలేదని ఎద్దెవ చేస్తున్న సుధీర్‌రెడ్డిని శ్రీకాళహస్తిని 30 సంవత్సరాల పాటు పరిపాలించిన మీ తాత తండ్రులు దోచుకొని ఆ సొమ్ములతో నిన్ను విదేశాల్లో చదివించారు. బంగారు స్పూన్లతో తినిపించారు. నియోజకవర్గ ప్రజలకు ఏమైనా మీముల్లె నుంచి అందించారా? అని ప్రశ్నించారు.కరోనా కాలంలో హైదరాబాదులో దాక్కొని ఇక ఏడాది ఎన్నికలుండగా అక్కడ నుంచి ఖర్జూరపు పండ్ల వ్యాపారాలకు శ్రీకాళహస్తిలో శివరాత్రికి వస్తారు.అలా వస్తున్నారని ఇక్కడేదో పసుపు కుంకుమమరువైనట్లు ఉండమ్మ బొట్టు పెడతానని ఇంటింటికి వస్తున్నారని మధుసూధనరెడ్డి ధ్వజమెత్తారు.వేపాకు మంత్రంతో వచ్చే కాటికాపర్లను నమ్మవద్దని మధుసూధనరెడ్డి విమర్శించారు.వారి మాటలు నమ్మితే నిట్టనిలువునా మునిగిపోతారని ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తి ప్రజలు ఓటర్లు చైతన్య వంతులని మాయగాళ్ళ మాటలకు లొంగరన్నారు. ఎవరు అభివృద్ధి పరులు ఎవరు మాటల మాయల పకీర్లో ప్రజలకు తెలుసునన్నారు.జగనన్న పథకాలే మా గెలుపుకు పునాదులు. మా విజయానికి శ్రీరామరక్ష అన్నారు.ఆఫీసర్ల గురించి మర్యాదగా మాట్లాడటం సుధీర్‌రెడ్డి నేర్చుకోవాలి. గోపాలన్నకు నియోజకవర్గంలో మంచి పేరుంది. అయితే సుధీర్‌రెడ్డికి ఎంత మంచి పేరుందో తాను ఎందుకు చెప్పాలి? జనానికి తెలుసునన్నారు.ఈ విలేకరుల సమావేశంలో తొట్టంబేడు కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ చిట్టివేలుజయగోపాల్, కొన్నలి రమేష్, రేణిగుంట ఎంపిపి హరిప్రసాద్‌రెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి,నాని, గోరా, కొళ్ళూరు హరినాయుడు, కంటా ఉదయ్ కుమార్, పసల కృష్ణయ్య, శ్రీనివాసులు, చింతా రాజేంద్ర,యేగేశ్వర్నాద్‌రెడ్డి, గాదిపాకుల కిరణ్,రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయంలో... చెంగల్వరాయస్వామి బ్రహ్మోత్సవాలు


నారదపుష్కరిణిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో శుక్ర వారం నుంచి ఆడికృత్తిక మహోత్స వాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు నిలయంగా ఉన్న శ్రీకాళహస్తీశ్వరాల యంలో ప్రతి నెల ఓ ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఈ నెపధ్యంలో ఈ నెల 4 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అధికారులు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. ఆలయంలోని చెంగల్వరాయ స్వామి ఆలయంలో అంకుర్పారణతో ప్రారంభం అయ్యే ఉత్సవాలు కుమారస్వామితిప్పపై భక్తుల బాగస్వామ్యంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో గురువారం ఆలయంలో ఏర్పాట్లుకు సంబంధించి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్‌తో చర్చించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చే ఉత్సవాలను దేవాదాయ శాఖతో పాటు పలు శాఖలు సమన్వ యంతో పని చేయాల్సిన ఉందని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. ఉత్సవాలను విజయవంతం చేయటానికి దేవస్థానం పోలీసు, మున్సిపల్ అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 4 నుంచి ఆలయంలోనూ, 8 నుంచి విజ్ఞానగిరిపై జరిగే మహోత్స వాలను కూడా అంతే ప్రణాళికతో పోలీసుల సహాకారంతో విజయవంతం చేస్తామ న్నారు. తాను ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత వచ్చిన రెండవ ఉత్సవాలు ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్ని ప్రజల మనోభావాలకు అనుగుణంగా నిర్వహిం చటంతో మంచి పేరు వచ్చిందన్నారు. అలాగే ఆడికృత్తిక మహోత్సవాల్ని కూడా గతంలో నిర్వహించని రీతిలో నిర్వహించాలని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సూచించారని ఈ మేరకు అధికారులకు ఏర్పాట్ల గురించి వివరించామన్నారు. ఈ నెల 8 భరణి, 9ఆడికృత్తిక, 10 తెప్పోత్సవం, 11 కళ్యాణోత్సవం నిర్వహించబడుతుందని వివరించారు

## చంద్రబాబుకు వైకాపాపై అంత కసి ఎందుకు

- ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్


విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త : ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుకు వైకాపా ప్రభుత్వంపై అంత కసి ఎందుకని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు ఎందుకు జిల్లాలో పర్యటిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. రెండేళ్లు కోవిడ్‌తో ప్రపంచం అతలాకుతలమైందని వివిధ దేశాలే కోలుకునేందుకు సమయం పట్టిందన్నారు. కోవిడ్ అనంతరం తమ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తుంటే అభివృద్ధి చేయలేదని చంద్రబాబు విమర్శిస్తున్నారన్నారు. తాము కోవిడ్ సమయంలో సైతం ప్రజల మధ్యనే ఉన్నామన్నారు. కుప్పంలో 35 ఏళ్లుగా ప్రతిపక్ష నేత డ్రామాషో ఆడారని వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాలనలో అమరావతిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో చూపించడం తప్ప మరేం చేశారని ప్రశ్నించారు. అమరావతిలో ఇళ్ల స్థలాలపై హైకోర్టు స్టే విధించిందని తమ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తుందన్నారు. కుప్పంలో తెదేపా నేతలు డ్రామా పాలిటిక్స్ ఆడుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చూస్తే అడ్రస్ లేకుండా పోతారని అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నా రన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న సురక్ష కార్యక్రమంను సిఎం జగనన్న నెలరోజుల పాటు చేపట్టారన్నారు. 1.46 లక్షల ఇళ్లను రాష్ట్రంలో తిరిగి 93.57లక్షల మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించామన్నారు.కుప్పంలో సైతం 70వేల ఇళ్లకు 54వేల ఇళ్లు తిరిగి ప్రజలకు యాభైవేల దాకా సర్టిఫికెట్లు అందించినట్లు చెప్పారు. వివిధ రెవెన్యూ, ఇతర సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలన్న తపన సిఎం జగనన్నలో ఉందన్నారు. తెదేపా నేతలు ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఈ నాలుగన్నర ఏళ్లలో 1లక్ష కోట్లు అప్పులు మాత్రం తెస్తే దాన్ని వక్రీకరించడం తగదన్నారు. దేశం నేతలు ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతునా న్నరని అభివృద్ధిపై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెండో వైస్ చైర్మన్ హాఫీజ్, ఎంపిపి అశ్విని మురుగేష్, సలహాదారు ఆర్.శ్రీనివాసులు, శివశంకర్, పెద్దన్న, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కోనేటి స్థలంలో కట్టడాలపై నివేదిక ఇవ్వండి

కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు

పుత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త : పట్టణంలోని 197/1,2 సర్వే నెంబర్లలో వున్న కోనేటి స్థలంలోని (తిరుక్కుళం) అక్రమ కట్టడాలపై నివేదిక ఇవ్వాలని తిరుపతి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ నీటి కుంట స్థలంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారని వీటిని తొలగించేలా అధికార యంత్రాంగాన్ని ఆదేశించాలని తెలుగుదేశం పార్టీకి చెందిన మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గాలి జీవరత్నంనాయుడు హైకోర్టులో గత నెల 19వ తేదీన ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇందులో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తిరుపతి జిల్లా కలెక్టర్, పుత్తూరు తహశీల్దారు, మునిసిపల్ కమిషనర్, సదాశివేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఆ మేరకు ఈ నెల 2వ తేదీన రిట్ పిటిషన్‌ను విచారించిన ద్విసభ్య బెంచ్ న్యాయమూర్తులు ధీరజ్ సింగ్ ఠాకూర్, ఎ.వి.శేషసాయి ఈ నెల 16వ తేదీ కల్లా కోనేటి స్థలం వాస్తవ స్థితి గతులపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్, కమిషనర్‌ను ఆదేశించింది. నీటి కుంటల పరిరక్షణకు సంబంధించి 2011వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి, జస్పాల్‌సింగ్‌కు మధ్య జరిగిన వివాదంలో పంజాబ్ కోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఉటంకించారు. రెవెన్యూ శాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు హాజరై ఒకవేళ కోనేటి స్థలంలో అక్రమ కట్టడాలు వుంటే అధికారులు సరైన చర్యలు తీసుకుంటారని న్యాయస్థానానికి విన్నవించారు. పిటిషనర్ పేర్కొన్న కోనేటి స్థలంలో అక్రమ కట్టడాల విషయమై నివేదిక ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.

## భూఆక్రమణలపై గ్రామస్తులు ఆందోళన

-ఎమ్మెల్యే కారును అటకాయించిన గ్రామస్తులు


ఎమ్మెల్యే కారును అటకాయించిన గ్రామస్తులు

సత్యవేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త: మండలంలోని పేరడం గ్రామంలో గురువారం ప్రభుత్వ భూములు ఆక్రమణకు నిరసనగా స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం కారును గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురౌతున్నాయని మండల అధికారులకు విన్నవిస్తున్నా ఇంతవరకు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని వాపోయారు. ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని ఎమ్మెల్యే వద్ద తమగోడును వెల్లబోశారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామస్తుల వినతి పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలను చేపడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని రెవిన్యూ అధికారులును ఆదేశించారు. తక్షణమే చర్యలు చేపట్టి గ్రామస్తులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామి ఇవ్వడంతో వారు శాంతించారు.

జగనన్న సురక్ష విజయవంతం

## కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు : ఎమ్మెల్యే



గూడూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారానికి గత నెలరోజులుగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వేలాది మంది సమస్యలు పరిష్కరించడం జరిగిందని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పోనకా దేవసేనమ్మ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఏర్పాటై ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పోనకా దేవసేనమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలవద్దకే అధికారులు వెళ్లేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టారన్నారు. నెల రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా వంద శిభిరాలు నిర్వహించి 69 వేల 805 మందికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాజ్యాంగం అంటే విలువలేని వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఆయన విమర్శించారు. అనేక సంవత్సరాలుగా గూడూరు పట్టణంలో జరగని అభివృద్ధి గత నాలుగేళ్ళలో జరిగిందని దేవసేనమ్మ వివరించారు. ఈ సమావేశంలో ఎఎంసి చైర్మన్ యమునమ్మ, వైస్ చైర్మన్ గోవర్ధన్, ఎంపిపి గురవయ్య, నాయకులు బత్తిని విజయ కుమార్, నాయకులు బోమిడి శ్రీనివాసులు, గోపాల్ యాదవ్, రమేష్, అజీజ్ ఖాన్, వినీష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష క్యాంపుల్లో 44 లక్షల సర్టిఫికేట్లు పంపిణీ

- రాష్ట్రష కమ్యూనిటీ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి

వెంకటగిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త: జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్రంలో 44 లక్షల 58 వేల సర్టిఫికేట్లను పంపిణీ చేసినట్లు రాష్ట్ర కమ్యూనిటీ బోర్డు చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 41 లక్షల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 2.7 లక్షల రైతులకు సంబంధించిన పత్రాలు తదితర వాటిని పంపిణీ చేశారు. జగనన్న సురక్ష క్యాంపులు రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడినట్లు చెప్పారు. జూలై నెలలో క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. సచివాలయం వలంటీర్ల వ్యవస్థను ఇతర దేశాల్లో కూడా ప్రవేశపెట్టేందుకు ఆ ప్రభుత్వాలు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. మొదట ఇతర రాష్ట్రాల వారు సచివాలయం వలంటీర్లను పెట్టేందుకు ఆలోచిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం పని చేస్తున్నారన్నారు. తనకు రాష్ట్ర కమ్యూనిటీ బోర్డు చైర్మన్, జిల్లా అధ్యక్షుడు, సమన్వయకర్త బాధ్యతలు ఇచ్చారని, వాటిని సమర్థ వంతంగా నిర్వహిస్తున్నానని తెలిపారు. కొందరు సర్పంచులు చెప్పుడు మాటలు విని లేనిపోని అపోహలకు గురవుతున్నారన్నారు. ప్రతిపక్షాలు వారిపై పోరాటం చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలయ్య, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, ధనియాల రాధా, సుబ్బారావు, సతీష్, మాడ జానకిరామయ్య, పూజారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన యూఎస్ కాన్సుల్ జనరల్



సత్యవేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా కాన్సుల్ జనరల్‌గా వ్యవహరిస్తున్న శ్రీమతి జెన్నిఫర్ లార్సన్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఛైర్మేన్ శ్రీనిరాజు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు సాదర స్వాగతం పలికారు. వైస్ కాన్సుల్ జనరల్ అఖిల్‌బెరి, ఆర్థిక వ్యవహారాల నిపుణుడు సిబా ప్రసాద్ త్రిపాఠీ, యూఎస్ ఫారిన్ కమర్షియల్ సర్వీస్ అడ్వైజర్ సునీల్ కుమార్ తదితరులు కాన్సుల్ జనరల్‌తో పాటు శ్రీసిటీకి సందర్శించారు. ఇక్కడి మౌళిక సదుపాయాలు, ప్రత్యేకతలు పారిశ్రామిక అభివృద్ధి గురించి వివరించిన రవీంద్ర సన్నారెడ్డి, విభిన్న రంగాలలో పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్న కంపెనీలకు శ్రీసిటీ అత్యంత విలువైన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందని పేర్కొన్నారు. పెప్సికో, క్యాడబరీస్, కోల్గేట్ పామోలివ్, విఆర్వీ చార్ట్ ఇండస్ట్రీస్,బాల్ కార్పోరేషన్, కెల్లాగ్స్ వంటి ప్రధాన బ్రాండ్లతో సహా పదకొండు అమెరికన్ కంపెనీలు శ్రీసిటీలో తమ పరిశ్రమలు ఏర్పాటు చేశాయని తెలిపారు. ఈ రకమైన చర్యలు రెండు దేశాలు మధ్య వ్యాపార సంబంధాలను మరింత బలపరుస్తాయని పేర్కొంటూ, కాన్సుల్ జనరల్ పర్యటన ఫలితంగా మరిన్ని అమెరికన్ కంపెనీలు శ్రీసిటీలో పెట్టుబడులుపెట్టడానికి మార్గం సుగమం చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీసిటీ వ్యాపారానుకూల వాతావరణం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కాన్సుల్ జనరల్ అగ్రశ్రేణి ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సిటీ ఏర్పాటుకు కృషి చేసిన శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు. శ్రీసిటీ అమెరికన్ కంపెనీలు మంచి అభివృద్ధి సాధించడం పట్ల సంతోషం వెలిబుచ్చిన ఆమె, యూఎస్ ఇండియా సంబంధాలను పెంపొందించడానికి శ్రీసిటీ లాంటి వ్యాపార కేంద్రాల కృషి ప్రశంసనీయమన్నారు. మేక్ ఇండియాలో అమెరికన్ కంపెనీల పాత్రకు ఇది చక్కని ఉదాహరణగా అభివర్ణించారు. శ్రీసిటీ వ్యాపార సామర్థ్యాన్ని అంచనా వేయడం,రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కార్యకలాపాలతో సహా శ్రీసిటీకి సంబంధించిన వివిధ అంశాలపై కాన్సుల్ జనరల్, ఆమెతో వచ్చిన అధికారులు ఆసక్తిని కనపరిచారు. కంపెనీ హెడ్ హెచ్‌ఆర్ కందస్వామి తమ పరిశ్రమ ఉత్పత్తి కార్యకలాపాలపై ప్రజంటేషన్ ఇచ్చారు.

## మణిపూర్ ఘటనలపై భగ్గుమన్న మహిళలు.. ఎన్జీఓ సంఘాలు



కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త : మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన ఘోరాలపై మహిళ, ఎన్జీఓ సంఘాలు భగ్గుమన్నాయి. గురువారం కుప్పం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. దేశంలో మహిళల భద్రతకు రక్షణ లేకుండా పోతోందని మహిళా సంఘాల నేతలు పేర్కొన్నారు. మణిపూర్ సంఘటన దేశం సిగ్గుతో తలదించుకునేలా చేసిందన్నారు. కుకీ తెగ మహిళలపై దారుణాలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్ నాగేశ్వరరావు, నరేంద్ర, గోవిందప్ప, రవినాయక్, సురేష్, డా॥ వరదరాజులు, మురుగేష్, బాబు, పిజి సెల్వం, పళని, రూబీ, ఇంద్రాణి, భారతి, శాంతమ్మ, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మూడు రోడ్లతో విశ్వవిద్యాలయ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు

ఎస్వీయూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక


నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్వీయూ విద్యార్థి సంఘాల

తిరుపతి (క్రీడా), ఆగస్టు 3 ప్రభాతవార్త : మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రతిపాదనలో భాగంగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మూడు రోడ్ల ప్రతిపాదనలతో విశ్వవిద్యాలయ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు వంటిదని ఎస్వీయూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు వ్యాఖ్యానించారు. గురువారం చేపట్టిన బంద్ విశ్వవిద్యాలయం నందు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు మాధవ్, ఆర్కె నాయుడు, ఆనంద్ గౌడ్, చిన్న, పొత్తూరి శ్రీకాంత్, అక్కులప్పనాయక్, కొట్టే హేమంత్, మల్లికార్జున, శివశంకర్ నాయక్, మహేంద్ర నాయక్, తదితరులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ప్రారంభం నాడు 1200 ఎకరాలు విస్తీర్ణం కలిగిన ఈ విద్యా సంస్థ నేడు కేవలం 562 ఎకరాలకు పరిమితమైనదని అయితే వాటిని విద్యా, వైద్య సదుపాయాల కోసం వినియోగించడాన్ని విద్యార్థి లోకం స్వాగతించిందని అయితే ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రతిపాదన లతో విశ్వవిద్యాలయ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆవేదనను, మనోభావాలను అర్థం చేసుకోకుండా నగరపాలక సంస్థ అధికారులు, పాలక మండలి సభ్యులు తాము అనుకున్నది జరిగే తీరాల్సి ఒదే అన్నట్టుగా వింత వాదన చేస్తూ విద్యార్థి సంఘాలను ఈ ప్రతిపాదనల ను వ్యతిరేకించే రాజకీయ పార్టీలపై దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

విశ్వవిద్యాలయం మధ్యలో రహదారులను వేయడం వలన ఉస్మానియా యూనివర్సిటీ తన అస్తిత్వాన్ని కోల్పోయిందని, ఆంధ్ర విశ్వ విద్యాలయంలో రోజు వారి రోడ్డు ప్రమాదాలను తట్టుకోలేక మూసివేసారని కళ్లెదురుగా ఇటువంటి ఉదాహరణలు కనిపిస్తున్న యూనివర్సిటీ అధికారులు స్పందించక పోవడం పై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉపకులపతి ఛాంబర్‌ను దిగ్బంధించారు.

అనంతరం ఉపకులపతి స్పందిస్తూ తాను ఇప్పటికే ఈ విషయంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళామని మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని, ఈ మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి పాలక మండలితో కూడా సంప్రదించి విశ్వవిద్యాలయంకి నష్టం వాటిల్లకుండా ముందుకు వెళ్తామని ప్రకటిం చారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు రామ్మోహన్, శేషాద్రి, నాగేంద్ర, వెంకటేష్, బాటసారి, అక్బర్, అశోక్, ఉరుకుందు, పృథ్వి, మహేష్, నవీన్, బీసన్న, తిరుమలేష్, చంద్రశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమం



పుత్తూరురూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త: వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమ ంలో భాగంగా ఇంటి వద్దకే పోషకాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం కృష్ణసముద్రం సచివాలయ పరిధి అంగన్‌వాడీ కేంద్రంలో పుత్తూరు మండలం ఎంపీపీ మునివేలు ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని గర్భిణీలు, బాలింతలు పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 104 ఆరోగ్య వెహికల్ ఫ్యామిలీ డాక్టర్ తల్లిపాల ప్రాముఖ్యత గురించి పోషకాహార ఆవశ్యకత గురించి వివరించారు. సీడీపీవో పద్మజ తల్లిపాల ఆవశ్యకత పిల్లల ఎదుగుదల అయోడిన్ ఒప్పు ప్రాధాన్యత వైఎస్ఆర్‌సంపూర్ణ పోషణ కిట్‌లో ఇచ్చే వస్తువుల్లో ఉండే పోషక విలువల గురించి వాటిని వాడే విధానం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కృష్ణసముద్రం సర్పంచ్, ఎంపీపీ, తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గీతాంజలి, అనిత, ఒగన్‌వాడి కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.